
## ఈ వారం కథ

# ఓ వర్షపు రాత్రి

సన్నగా వర్షం మొదలైంది. అసహనంగా వాచీలో టైం చూశాను. రాత్రి పది గంటలైంది. బస్టాప్ నిర్మానుష్యంగా వుంది. కనుచూపు మేరలో రోడ్డు మీద జన సంచారం లేదు.



జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాను. ఇద ఆఖరి సిగరెట్. జేబు తడిమి చూశాను. వంద రూపాయిల నోటు గరగరలాడింది. ఈ రోజు ఉదయం నుంచి ఒకే ఒక్క బేరం తగిలింది. దాని తాలూకే ఈ నోటు.

ఉదయం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

ఆఫీసులకి వెళ్ళే టైం కావటాన సిటీ బస్సు రద్దీగా వుంది. నాలాంటి వాళ్ళకి అదే మంచి అవకాశం. ముందు డోర్‌లోంచి బస్సు ఎక్కాను. జనాల్ని నెట్టుకుంటూ లోపలికి వెళ్ళాను. అక్కడ నాకు ఉపయోగపడే వ్యక్తి కన్పించాడు.

ఇరవై రెండేళ్ళ యువకుడు. జీన్స్ ప్యాంటు మీద షర్టు టక్ వేశాడు. భుజాల మీదికి పడు తున్న జుట్టు. మీసాల్లేకపోతే ఆడదాన్లా వుంటాడు. ఓ చేతిలో నోట్ బుక్ వుంది. కాలేజి స్టూడెంట్‌లా వున్నాడు. తన ముందు నించున్న యువతి నడుముకి మోచేతిని తగిలిస్తున్నాడు.

నా కళ్ళు మెరిశాయి. అతడి దగ్గరగా వెళ్ళాను. ముందు నుంచి వస్తున్న లారీని తప్పించుకోవడానికి డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. అదే అదనుగా అతడు ఆమె మీదికి వాలాడు. నాకూ అదే అదను. ఒక్క అడుగు ముందుకి వేసి అతడి భుజాన్ని ఢీకొట్టాను.

నా వృత్తిలో హస్తలాఘవం ముఖ్యం. నేనింత కాలం దానినే నమ్ముకున్నాను. ఇప్పుడూ అదే నాకు ఉపయోగపడింది. క్షణంలో అతడి జేబులోని వంద రూపాయిల నోటు నా చేతిలో కొచ్చింది. "సారీ" అని గొణిగాను. అతడు ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేడు. తన ముందున్న యువతి నడుముని తాకుతూ తన్మయత్వంలో మునిగిపోయి వున్నాడు. వేగంగా వెనకవైపు డోర్ దగ్గరికి నడిచి పక్క స్టాప్‌లో దిగేశాను.

చల్లటి జల్లు విసురుగా మొహం మీదికి కొట్టడంతో వాస్తవంలోకొచ్చాను. చివరికంటా కాలిన సిగరెట్‌ని విసిరికొట్టి, బెంచీ మీద మూలకి ఒదిగి కూర్చున్నాను.

ఇంటి ఓనరు గుర్తొచ్చాడు. అయిదు నెలల అద్దె అతడికి బాకీపడి వున్నాను. ఆ ఇంటికి

—సన్నపరెడ్డి కృష్ణారెడ్డి

అద్దె నెలకి వంద రూపాయిలు. ఇల్లంటే కూలిపోవడానికి సిద్ధంగా వున్న రెండు గదులు అంతే... నిన్ననే చెప్పేశాడు రెండు రోజుల్లో అద్దె చెల్లించకపోతే ఇంట్లోంచి గెంటేస్తానని.

జేబులోని వందా అతడికివ్వక తప్పదు. మిగతాది ఎలాగైనా సర్దిచెప్పొచ్చు. లేకపోతే అవమానాలపాలు కావాల్సి వస్తుంది. బయట ఎలాంటి జీవితం గడిపినా చుట్టుపక్క ఇళ్ళవారి దృష్టిలో నేను చాలా ఉత్తముడిని.

ఇవ్వాళ్టి కింకో ఛాన్స్ తగిల్తే చాలు. కానీ వాతావరణం చూస్తే అంత అదృష్టం వున్నట్టు లేదు.

ఇంటికి వెళ్ళి చేసేదేం లేకపోవడంతో మరి కొంచెం సేపు వెయిట్ చేద్దామని నిర్ణయించుకున్నాను.

కళ్ళు చికిలించి రోడ్డు మీదే దృష్టి నిలిపాను. సరిగ్గా అయిదు నిమిషాల తర్వాత నా కళ్ళు సంతోషంతో మెరిశాయి.

దూరం నుంచి ఓ యువతి వడివడిగా, దాదాపు పరుగెడుతున్నట్టు ఇటే వస్తోంది. చప్పున లేచి నించున్నాను. ఒక్కసారి వళ్ళు విరుచుకొని అలర్టయ్యాను. ఆమె దగ్గరికి వచ్చాక ఒక్క ఉదుటున మెడలోని గొలుసు లాక్కొని కామ్‌గా చీకట్లో కలిసిపోతే సరి. ఆమె ఎంత అరిచినా పట్టించుకునే నాథుడెవడూ లేడిక్కడ.

వర్షం జోరు ఎక్కువైంది. చలి వణికించేస్తోంది. కానీ నా నిరీక్షణ ఫలించిందన్న సంతోషంలో నేను దాన్ని పట్టించుకోలేదు.

ఆమె మరింత దగ్గరయింది. ఒక కాలు రోడ్డు మీద పెట్టి సిద్ధంగా నించున్నాను. ఆమె ఇంకో అడుగు వేయగానే గొలుసు లాక్కుని పారిపోవడానికి ఆమె మెడవైపు చూసిన నా కళ్ళు మెరిశాయి. ఆమె మెడలో రెండు గొలుసులున్నాయి. 'డబుల్ లక్కీ' అనుకున్నాను. ఆడవాళ్ళ నగల పిచ్చి నాకీ విధంగా ఉపయోగపడబోతూంది.

ఆమె నా ముందుకి వచ్చింది. నేను చప్పున చేయి ముందుకి సాచాను. కానీ ఆమె అంతకన్నా వేగంగా నా చేతుల్ని పట్టుకుంది. "నేను చాలా ఆపదలో వున్నాను... దయచేసి నన్ను కాపాడండి... ప్లీజ్" అంది.

ఆమె ఈ మాటలు ఎంత దీనంగా అన్నదంటే నేను వెంటనే నా చేతిని వెనక్కి లాక్కున్నాను.

"నన్నా దుర్మార్గులు తరుముకొస్తున్నారు. ఎలాగైనా నన్ను కాపాడండి. మీకు పుణ్యముంటుంది" అందామె దీనంగా.

తల తిప్పి ఆమె వచ్చిన దారి వెంబడి చూశాను. ఇద్దరు వ్యక్తులు వేగంగా ఇటే వస్తున్నారు.

"వాళ్ళే... నన్ను తరుముకుంటూ వస్తున్నారు"

"ఎవరు వాళ్ళు? మిమ్మల్నెందుకు వెంబడిస్తున్నారు?" అనడిగాను.

"ఆ వివరాలు తర్వాత చెప్తాను. వాళ్ళు చూశారంటే మనల్నిద్దర్నీ బ్రతుకనివ్వరు" అంది కంగారుగా.

అటూ ఇటూ చూసి రోడ్డు పక్కనున్న రాయి తీసుకుని స్ట్రీట్ లైట్‌కేసి గురిచూసి విసిరాను. నా గురి తప్పలేదు. లైటు భళ్ళున పగిలిపోయింది. అంతా చీకటై పోయింది.

ఆమె చేయి పట్టుకుని బస్ షెల్టర్ వెనక్కి లాక్కెళ్ళాను.

"కూర్చోండి" అన్నాను. ఆమె ఒదుక్కుని కూర్చుంది. నేను ప్రక్కనే మోకాళ్ళ మీద కూర్చున్నాను.

ఇంతలో ఆమెని వెంబడిస్తున్నవాళ్ళు షెల్టర్ దగ్గరికి వచ్చారు. నేను ఊపిరి బిగపట్టాను.

వాళ్ళు కాసేపు అక్కడే ఆగారు. నా గుండె చప్పుడు నాకే వినిపిస్తూంది. ఆమె భయం వల్లనో, చలి వల్లనో వణుకుతూంది. నా కుడిచేయి ఆమె నడుముని చుట్టివుంది. ఆమె భయంతో ఆ చేతిని గట్టిగా పట్టుకొంది.

"అది ఇటువైపే వచ్చింది. ఇక్కడే ఎక్కడో వుండి వుంటుంది" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"ముందుకి వెళ్ళిందేమో చూద్దాం పద" అన్నాడింకొకడు.

"సరే పద".

ఇద్దరూ ముందుకి పరిగెత్తుకుంటూ వెళ్ళారు.

కాస్సేపాగి బయటికి వచ్చాం. ఆమె షాక్ నుంచి ఇంకా తేరుకున్నట్టు లేదు. భయం భయంగా చూస్తూంది.

"ఇప్పుడు చెప్పండి... ఎవరు వాళ్ళు?" అనడిగాను.

"వాళ్ళలో ఒకడు నా స్టెప్ ఫాదర్. మా నాన్న చనిపోయాక ప్రేమ నటించి అమ్మని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయ్యాక నాన్న సంపాయించిన ఆస్తినంతా తన వ్యసనాలకి తగలేయసాగాడు. అడ్డుచెప్పిన అమ్మని హింసించేవాడు. ఆ దిగులుతో అమ్మ మంచం పట్టింది. సరైన వైద్య సహాయం అందక రెండేళ్ళకే మరణించింది.." అని ఆగింది.

చనిపోయిన ఆమె తల్లి గుర్తొచ్చిందేమో గొంతు బొంగురుబోయింది. చిన్నగా ఏడవసాగింది.

కాస్సేపటి తర్వాత కొనసాగించింది "అప్పట్నుంచీ వాడు నా పట్ల వెకిలిగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. నాచేత బలవంతంగా చదువు మాన్పించాడు. వాడికి తోడుగా వాడి అనుచరుడ్ని ఒకడిని ఇంట్లో పెట్టుకున్నాడు. అయినా సహించాను. చివరికి తెగించి నా మీద అత్యాచారం చేయబోవడంతో ఇంట్లోంచి వచ్చేశాను".

ఆమె చెప్పడం పూర్తిచేసి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ప్లీజ్... ఏడవకండి.... కంట్రోల్ యువర్‌సెల్ఫ్" అన్నాను.

చేతినడ్డుపెట్టుకుని ఏడుపాపుకొంది.

కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది.

"ఇప్పుడెక్కడికి వెళ్తారు" అడిగాను కాస్సేపాగి.

"తిరుపతిలో మా అమ్మగారి తాలూకా బంధువులున్నారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళాలనుకుంటున్నాను".

నాచీ వంక చూశాను. చీకట్లో టైం కన్పించలేదు. పదకొండు అయి వుంటుంది. ఆమెని ఒంటరిగా వదిలి వెళ్ళడానికి మనసొప్పలేదు.

"మిమ్మల్ని రైల్వే స్టేషన్ దగ్గర దిగబెట్టమంటారా?" అనడిగాను.

ఆమె మౌనంగా కాదూ, అవునుల మధ్య తలూపింది.

కాదని చెప్పడానికి భయపడుతూందని, అవునని చెప్పడానికి మొహమాటపడుతూందని అర్థమైంది.

"ఆల్‌రైట్. కొంచెం ముందుకి వెళ్తే ఆటో

ఒకసారి అబ్రహంలింకన్ 'వాషింగ్టన్ చరిత్ర' అన్న పుస్తకాన్ని పొరుగింటాయన నుండి తెచ్చుకుని చదవసాగాడు. రాత్రిళ్ళు చదవగానే ఆ పుస్తకాన్ని తలదిండు కింద దాచుకునేవాడు. ఒకనాటి రాత్రి పెద్ద తుఫాను వర్షం వచ్చి కప్పులోంచి నీళ్ళు కారసాగాయి. పడకలతో సహా అన్ని తడవగా ఆ పుస్తకం కూడా తడిసి కొంత పాడయింది. మరునాడు అబ్రహం బాధపడుతూ ఆ పొరుగాయన వద్దకు వెళ్ళి పుస్తకంపాడు చేసినందుకు తానేమి పరిహారం చెల్లించాలి అని అడిగాడు. "మూడు రోజుల పాటు తన కళ్ళంలో ధాన్యం నూర్చ" మన్నాడు ఆయన. అప్పుడు "ఆ పని పుస్తకం ధరకు సరిపోతుందా లేక పాడయినందుకు నష్ట పరిహారం మాత్రమేనా?" అని అడిగాడు అబ్రహం. అందుకతడు నవ్వి—"ఇంకో మూడు రోజులు అదనంగా పని చేస్తే ఆ పుస్తకం నీదవుతుంది" అన్నాడు. లింకన్ యొక్క ఈ వ్యవహార దక్షతే క్లిష్ట దశలో వున్న జాతిని రక్షించడానికి మూలకారణమయింది.

—సేకరణ:— భమిడిపాటి వెంకటేశ్వరరావు

స్టాండ్ వస్తుంది... నడవండి'' అన్నాను.

పైట కొంగు భుజమ్మీదికి లాక్కుని ముందుకి నడిచింది. అయిదు నిమిషాల్లో ఆటో స్టాండ్ చేరుకున్నాం.

''మీటర్ మీద పది రూపాయిలు ఎక్స్ట్రా ఇవ్వాలి'' అన్నాడు ఆటోవాడు.

''అలాగే పద'' అన్నాను.

అరగంటలో రైల్వే స్టేషన్ చేరుకున్నాం. ఆటో వాడు మీటర్ చూసి ''ఎక్స్ట్రా ఛార్జీతో కలిపి పాతిక రూపాయిలైంది'' అన్నాడు. ఆటో దిగి ఆమె వైపు చూశాను ఫేర్ చెల్లిస్తుందేమోనని.

మౌనంగా తన వేలికున్న ఉంగరం తీసి ముందుకి చాపింది.

ఆశ్చర్యపోయి ''ఇదేమిటి?'' అన్నాను.

''ఇంట్లోంచి వచ్చేముందు డబ్బేమీ తీసుకు రాలేదు'' అంది.

''అది మీ వేలికి వుంచుకోండి'' అని జేబు లోంచి వంద రూపాయిల నోటు తీసి అందించాను.

''చిల్లర్లేదా?'' చిరాగ్గా అడిగాడు.

లేదన్నట్టు తలూపాను. వాడు జేబులోంచి డబ్బై రూపాయిలు తీసి ఇచ్చాడు.

''మిగతా అయిదు రూపాయిలెక్కడ?''

''చిల్లర్లేదు'' నిర్లక్ష్యంగా అన్నాడు.

చేసేదేమీ లేక వదిలేశాను.

స్టేషన్‌లోకి వెళ్ళాం. కౌంటర్ దగ్గర టిక్కెట్ కొన్నాను. ఆమె నా వైపు కృతజ్ఞతగా చూసింది.

''ట్రైన్ బయల్దేరడానికి ఇంకా టైముంది. ఆ బెంచీ మీద కూర్చోండి'' అన్నాను. ఆమె బెంచీ మీద కూర్చుంది. నేను పక్కకి వెళ్ళి టీ తీసుకొచ్చాను. ఆమె తల అడ్డంగా తిప్పింది.

''తీసుకోండి... ఈ చలిలో టీ తాగితే వెచ్చగా వుంటుంది'' అన్నాను.

ఆమె గ్లాసందుకుంది.

కాస్సేపట్లో ట్రైన్ బయల్దేరబోతున్నట్టు అనౌన్స్‌మెంట్ విన్పించింది.

ఆమె నావైపు తిరిగి ''ఈ వర్షపు రాత్రి మీరు నాకు చేసిన సహాయం మరువలేనిది. మీరు లేకపోతే నేనేమై వుండేదానినో. మీరు చేసిన సహాయానికి నేను మీకు ఎంతో ఋణపడివు న్నాను. కనీసం ఈ విధంగానైనా నా ఋణం తీర్చుకోనివ్వండి'' అని తన వేలికున్న ఉంగరం తీసి నా వైపు సాచింది.

నేను తల అడ్డంగా తిప్పాను.

''ప్లీజ్ తీసుకోండి''

''వద్దు'' స్థిరంగా అన్నాను.

ఇంతలో ట్రైన్ కూత పెట్టింది.

''ట్రైన్ బయల్దేరేలా వుంది ఎక్కండి'' అన్నాను. ఆమె కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కింది. కిటికీ దగ్గర సీట్లో కూర్చుంది. నేను ప్లాట్ ఫారం మీద కిటికీ దగ్గర నించున్నాను.

జేబులోంచి మిగిలిన నోట్లు తీసి ఆమె చేతిలో పెట్టి ''తిరుపతి వెళ్ళాక మీ ఖర్చులకి అవస రమవుతాయి వుంచండి'' అన్నాను.

''అబ్బే.... వద్దండి''

''ఫర్లేదు వుంచండి'' అని వాటిని ఆమె చేతిలో పెట్టాను.

ఆమె సజల నేత్రాలతో నావైపు చేతులు జోడించి—''వెళ్ళొస్తాను'' అంది.

నేను తలూపాను.

రైలు పెద్దగా కూతపెట్టి కదిలింది.

అప్పుడు గుర్తొచ్చింది నేనామె పేరు కనుక్కో లేదని. రైలు ప్రక్కనే పరుగెత్తి ''మీ పేరేమిటో చెప్తారా?'' అని అరిచాను.

నా అరుపు రైలు కూతలో కలిసిపోయింది. ఆమె నన్ను ఆగిపొమ్మని సైగ చేసింది. రైలు వేగం పుంజుకుంది. నేను ఆగిపోయి చేయి వూపాను.

కిటికీలోంచి కన్పిస్తున్న ఆమె మొహం కనుమ రుగయ్యేంత వరకూ చేయి వూపుతూనే వుండి పోయాను.

■■


## బంగారు భవిష్యత్తు కోరే విద్యార్థులకు బంగారు వరాలు

1992–93 సం॥ లో అత్యధిక మార్కులు సంపాదించే

## పాఠశాల, మాబడి చందాదారులకు బంగారు పతకాలు + మరెన్నో ఉచిత కానుకలు

చందాలు పంపుటకు ఆఖరు తేది : 31–7–1992

| పత్రిక | చందా | చందాదారు లందరికి ఉచిత కానుక | ప్రతి పది మంది చందాదారులలో ఒకరికి ఉచిత కానుక | అత్యధిక మార్కులు సాధించిన వారికి బంగారు పతకాలు | చందాలుపంపాల్సిన చిరునామా |
|---|---|---|---|---|---|
| పాఠశాల 10వతరగతి | రూ. 70/- | ప్రశ్నా పత్రాల విశ్లేషణ | 70 రూ. విలువైన జనరల్ నాలెడ్జి పుస్తకాలు | రాష్ట్రస్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలకు పతకాలతో బాటు నగదు బహుమతులు, ప్రతి జిల్లాస్థాయిలో ఒక పతకం | పాఠశాల చౌడేపల్లె - 517 257 చిత్తూరు జిల్లా |
| మాబడి 7 వతరగతి | రూ. 50/- | విజ్ఞాన దీపిక | 50 రూ. విలువైన జనరల్ నాలెడ్జి పుస్తకాలు | ప్రతి జిల్లాస్థాయిలో ఒక బంగారు పతకం | మాబడి (7వ తరగతి) చౌడేపల్లె - 517 257 చిత్తూరు జిల్లా |
| మాబడి 5 వతరగతి | రూ. 40/- | విజయవాణి బాలశిక్ష | | | మాబడి (5వ తరగతి) చౌడేపల్లె - 517 257 చిత్తూరు జిల్లా |

చందాలు పంపుటకు ఆఖరు తేది : 31–7–1992

The Director of School Education, Hyderabad, A.P. in his proceedings Rc. No. 204 B4/SCERT/88 commended these periodicals for use in schools.

పబ్లిక్, కామన్ పరీక్షల ఫలితాలు, మార్కులు తెలిసిన పది రోజుల లోపల చందాదారులు మార్కుల లిస్టు కాపీని హెడ్మాష్టరు చేత ధృవీకరింప జేసి మా కార్యాలయానికి పంపాలి.

ఎడిటర్ : నాయుని కృష్ణమూర్తి